# కలతపడ్డ గంగ

ఎండ కరిగిన వెండిలా మెరుస్తూంది. ఎండలో కొండ ధళా ధళా మెరుస్తూంది. ఎటుచూసినా అంతూ పొంతూలేని సముద్రం నిగనిగా పాదరసంలా మెరుస్తూంది. దూరంగా సముద్రంలో ఏడెనిమిది పడవలు హంసల్లా తీరం వెంపొస్తున్నాయి. ముగ్గురు దొరలు, యిద్దరు దొరసాన్లు బైనాక్యులర్లతో, తీరాన్ని, గుడెశల్ని, సముద్రాన్ని, పడవల్ని గమనిస్తున్నారు.

పడవలు దగ్గర పడుతూంటే తీరంమీద కోలాహలం యెక్కువౌతూంది. జాలారివాళ్లు గుంపులుగాకూడి, వస్తూన్న సముద్రప్పంట కోసం ఆతృతగా యెదురుచూస్తున్నారు. పడవలు యెగిరిపడుతూన్న అలలమీద వయ్యారంగా, వింతగా నాట్యం చేస్తున్నాయి. పడవలు యిసక మొయ్యగానే కేకలేస్తూ పెద్దవాళ్లు, పిల్లలు వాటి తాళ్లుపట్టుకుని లాగుతున్నారు. పడవల్లో వాళ్ళు సముద్రపు హోరునిమించి నవ్వుతో అరుస్తున్నారు. వాళ్ళ తడిసిన నల్లటి శరీరాలు యెండలో నిగనిగలాడుతున్నాయి. కొండలు కదులుతున్నాయి. గోచీ లెగురుతున్నాయి. పొడి యిసకలో బుట్టలు పట్టుకు నిలబడ్డ స్త్రీల మొహాలు వికసిస్తున్నాయి.

అక్కడ కదలికలేనిది కొండ మాత్రమే. ఏనుగులా పడుకుంది. ఎవరొచ్చినా లేవదు. సముద్రం పొంగి మీదపొర్లినా ఎనుబోతులా చలించదు. ఆ కొండ ఏరాడ కొండ. దాని పక్కనించే కొండచిలవల్లా స్టీమర్లు వెడిపోతాయి. దాని పాదాల్ని త్రాచుపాముల్లా చుట్టుకుని కెరటాలు ఢీకొని బొంగలు కక్కుకుంటాయి. దాన్నెత్తిమీద నలభైమైళ్ళ మేర నలుదిక్కుల

గుడ్లురుముతూ నిత్యం తనిఖీచేస్తున్న తాటక అప్పగారు 'లైట్‌హౌస్' వుంది. దాని వొంటిమీద రోమాల్లా మహావృక్షాలున్నాయి. నల్లుల్లా జీపులు పరుగెడతాయి. చీమల్లా మనుషులు పాకుతారు. కాని అది కదల్దు. గర్జించదు. దానికి మోహంలేదు. మోజులేలేవు. ఆ కొండ—— ఏరాడ కొండ.

కొండకింద ఏరాడ వూరుంది. చుట్టుతిరిగి పట్నంవస్తే దూరమే. అడ్డంగా కొండమీంచి వస్తేదగ్గిర. ఆ వూర్నుంచి కాయకూరలు మొదలు కరివేపాకు వరకూ రోజూ పట్నానికొస్తాయి. పట్నవాసపు నాజూకు మనుషులు, పదిచోట్ల కూలబడి, వూపిరందక జాపోస్తూ కొండ యెక్కుతారు. కాని ఏరాడ స్త్రీలు రెండుమణుగుల కూరల బరువున్న తట్టలుమీద పెట్టుకుని, అవలీలగా కొండ యెక్కి దిగివస్తారు. నెత్తి మీద బరువుతో, చెమట చుక్కల మొహాలతో, చిరునవ్వులతో వాళ్లు లయబద్ధంగా విస విసా నడుస్తుంటే అదొక నృత్యంలా వుంటుంది.

ఏరాడకొండ దాటి సుమారొక మైలు సముద్రపొడ్డంటే వెళితే జాలారివాడ కనిపిస్తుంది. అక్కడ మొత్తం వొక యాభై గుడిశలున్నాయి. ఒకటీ రెండు పెంకుటిళ్లున్నాయి. పొడియిసకలో కూరుకుపోయినట్టున్న ఆ గుడిశలు వేట నుంచి చేపల బరువుతో పడవలొచ్చినపుడు ఒక్కసారి కలకల్లాడతాయి. ఇతర వేళల్లో నిర్జీవంగా వుంటాయి. చీకటి రాత్రిళ్ళు హోరుమనే అలల రొదలో, యీదురు గాలిలో, దీపాల్లేని ఆ గుడిశలు చీకట్లో గేదెలు పడుకున్నట్టుంటాయి.

గంగ జాలారివాడకొచ్చి మూణ్ణెల్లైంది. కోనాడనించి పట్నం మీదుగా ఏరాడ దాటి యీ వూరొచ్చేసరికి 'అబ్బో! ఇంత నోకం వుందా' అనిపించింది గంగకి. చిరునవ్వులొచ్చేసరికి బుగ్గలు లొత్తలు పడ్డాయి. ఆ లొత్తలు చూస్తే పోలయ్యకి మహాయిది.

గంగ పెళ్ళికిముందు కోనాడ దాటి ఎరుగదు. ఊరు దాటడం యీ వూరు రావడానికే. కోనాడ దగ్గిర జాలారిపేట వుంది. ఆ వూరికి గంగ తండ్రి పెద్ద. తండ్రి మోతుబరి, అతనికి ఆరు పడవలున్నాయి. అతని కింద యిరవైమంది జీతగాళ్ళున్నారు. గంగ తల్లి వడ్డీ వ్యాపారంచేస్తుంది.

వ్యాపారంమీద పదివేలుపైగా వున్నాయి. స్వంత బంగారంకాక, తాకట్టు బంగారం వుంది. వాళ్ళకి గంగ ఒక్కర్తే కూతురు. కొడుకుల్లేరు. అంచేత అల్లారుముద్దుగా పెరిగింది.

వాళ్ళలో పెళ్ళికి ప్రత్యేకంగా ఒకతంతు వుండదు. దంపతులు కావలసిన వాళ్ళని తలిదండ్రులు స్వేచ్ఛగా వుండనిస్తారు. ఆ జంట యెకాయెకీని సంసారం ఆరంభిస్తుంది. తర్వాత ఎల్లమ్మజాతరో, పైడి తల్లమ్మ పండగో వచ్చినపుడు, ఆ డప్పులు నృత్యాల గడబిడలో కుర్రాడి చేత కుర్రదానికి ఓ పుస్తెలాంటిది కట్టించేస్తారు. అంతా సరదాగా తిని, తాగి, తందనాలాడుతారు. అదే పెళ్ళి.

కాని గంగతల్లి తన కూతురికి అలాంటి పెళ్ళిససేమిరా వీల్లేదంది. ఊళ్ళో కుర్రాడికసలే యివ్వనంది. ఏరాడ దగ్గిర జాలారివాడలో తన యజమానికి దూరపు అప్పవుంది. ఆమె కొక కొడుకున్నాడు. కూతుర్లు లేరు. మొగుడు లేకపోయినా— చిన్న పెంకుటిల్లువుంది. కాస్త డబ్బు కూడా వుంది. ఆ సమ్మంధం కావాలంది మొగుడితో. మనకి కొడుకుల్లేరు కదా ఊళ్ళో సమ్మంధమైతే అల్లుడు మన్దగ్గరే వుంటాడు, నేనెల్లకాలం పన్జెయ్యగల్నా? నా తరువాతొకడుండొద్దా అంటే ఆమె వినలేదు. ఊళ్లో గంగకి తగిన కుర్రాళ్ళేడంది.

పెళ్ళయి గంగ కోనాడ నించి ఏరాడ వెళిపోయింది.

గంగంటే జాలారిపేట అందరికీ ముద్దే. ఊరి పెద్ద కూతురని, వాళ్ళమ్మ చండశాసనురాలనే కాకుండా, ఆ పిల్ల యెదురుగుండా అలలతో అంతులేని జలాలతో, రత్నాలు, ముత్యాలతో తూగే జలగంగా వరప్రసాద మని వాళ్ళ నమ్మకం. సముద్రపొడ్డున, తోటలంట, దొడ్లంట గంగ స్వేచ్ఛగా తిరిగేది.

ఆవు వెనక తోకలా ఆమె యెక్కడికివెడితే అక్కడికి వెనకలే భూలోకా వెళ్ళేవాడు. భూలోకా వయసెంతో చెప్పడం కష్టం. ముప్పై నుంచి యాభై వరకూ యెంతైనా కావచ్చు. మసిరంగు శరీరం. ఎత్తైన ఛాతీ, కండలు తిరిగిన చేతులూ, కాళ్ళూ. మెడ దగ్గిర లావుగా వుంటుంది.

కాని మెదలేదు. ఒక కన్ను గుడ్డి. నోట్లో పళ్లు చెదురుమదురుగా వుంటాయి. తలమీదపొట్టి వెంట్రుకలు గుబురుగుబురుగా వుంటాయి. వాడు చేతులూపుకుంటూ నడుస్తాడు. ఆకాశం అదిరేలా నవ్వుతాడు. కొట్టినా, తిట్టినా వాడి మనసు కళుక్కుమనదు. గంగ నెవరైనా కసిరితేచాలు ఆవు శరీరంమీద ఈగ వాలితే వెంటనే తోక కదిలినట్టు రెచ్చిపోతాడు. గంగని భుజాలమీద కూచోపెట్టుకొని తిప్పేవాడు. చేతులమీద జుమ్మని భూమికీ ఆకాశానికీ ఉయ్యాల ఊపుతాడు. భూలోకా గంగకొక జంతువులా కనుపించేడు. వాణ్ణి వెల్లకిలా పడుకోమని, గుండెలమీద కూచొని, నోరు పగలదీసి గుహలావున్న దాంట్లోకి తొంగిచూస్తూ పళ్లు లెక్కబెట్టేది. వాడంటే గంగకి చాలాదయ. వాడు చాలా అందవికారంగా వున్నాడని కూడా తెలుసు. ఆకాశంమీద హరివిల్లు, వెన్నెల్లో యెగరి విరిగిపడుతున్న సముద్రపు కెరటాలు, హోరని కురుస్తున్న వానలో లీలగా కనిపిస్తూ గాలికి వూగుతున్న కొబ్బరిచెట్లుగల యీ సుందర ప్రకృతిలో భూలోకా ఒక భయంకర వికృతి అనుకొనేది.

గంగకి ఐదేళ్ళ వయసపుడొక చిత్రమైన సంఘటన జరిగింది.

ఎక్కడో దూరంగా సముద్రంలో రేగిన తుఫాను వచ్చివచ్చి కోనాడ రేవుని తాకింది. మూడు రోజులై ఆకాశం బద్దలైనట్లు వాన కురుస్తూంది. ఆకలితో వొళ్ళు తెలియని పులుల్లా బొబ్బలు పెడుతూ ఉవ్వెత్తుగా లేచిన కెరటాలు వరసబెట్టి ఒకదానివెనుక వొకటి తీరాన్ని ఢీకొంటున్నాయి. జాలారిపేట సుమారు మునిగిపోయింది. గుడిశల్లోవాళ్లు ఎత్తు ప్రదేశాలకు వెళ్ళిపోయారు. కొబ్బరిచెట్లు తాగిన వాళ్ళలా జోగిపోయేయి. చెట్లు కూలిపోయాయి. అక్కడివాళ్ళు భయంచేత కుక్కినపేన్లయేరు. అకలికి అటమటించిపోయేరు. చలికి వదవదలాడిపోయేరు. ఆ మూడ్రోజులూ పగలూ రాత్రీ వొక్కలాగే వున్నాయి. పగలు సూర్యుడు కనిపించలేదు, రాత్రి చుక్కలూ కనిపించలేదు.

ఐతే అదివాళ్ళకి కొత్తకాదు. బాధలు దేవుడా అని పడనూ పడతారు, బాధలు తీరేక తిరిగి కలల్లాడుతూ త్రయారౌతారు.

గంగ తండ్రిది డాబాయిల్లు. ఎత్తయిన స్థలంలో వుంది. అతడు తన యింట్లో కొంతమందికి ఆశ్రయం యిచ్చేడు. ఇంకా అలాంటి మరి రెండిళ్ళలో కొందరు తలదాచుకున్నారు. చాలామంది పిల్లా పిచికతో యిరుగుపొరుగు వూళ్ళకి పారిపోయేరు. అంతా గంగమ్మ తల్లికి కోపం వచ్చిందనుకున్నారు. మొక్కులు మొక్కుకున్నారు.

ఆ మూడ్రోజులూ గంగ భూలోకాకి బల్లిలా అంటుకుపోయింది. తుఫానుని తిట్టింది. చీకటిని, వురుముల్ని, మెరుపుల్ని తిట్టింది. ఆ కోపంలో భూలోకాని కూడా తిట్టి దగ్గరసావున్న వాడి చెవులు మెలేసింది. సముద్రాన్ని తిట్టినప్పుడే వాడా పిల్లని మందలించబోయాడు— 'తప్పు-గంగ మన తల్లి - తిట్టకూడదు' అని. కాని గంగ వాడి చెవులు తిరిగి నులపలు పెట్టింది. నాలుగోరోజు తెల్లవారుతూందనగా తుఫాను ముగిసింది. హోరుగాలి మాత్రం వీస్తూంది. సముద్రం సద్దు మణిగింది.

ఈ నాలుగురోజులు తీరానికి మైలున్నర దూరంలో ఒక పొగ ఓడ చిక్కడిపోయింది. దొరికిపోయిన దొంగలా తుఫాను దెబ్బలు తింటూ కిమ్మనకుండా యిసక మేటలో కూచుంది. తెల తెలవారుతూండగానే గంగ తండ్రి పది పడవల్లో ఓడ దగ్గరకి మనుషుల్ని పంపాడు.

తుఫానువల్ల కోనాడ సమీపంలో యిసుకలో చిక్కుపడి పోయిన యీ ఓడ వార్త తెలిసి విశాఖపట్నం నుంచి కొందరు డాక్టర్లు, ప్రథమ చికిత్స దళంవారు వచ్చేరు. వాళ్ళలోహుషారైన యువతులుకూడా వున్నారు. వాళ్ళు బిస్కత్తులు, రొట్టెలు, తేనె, వెన్న, కాఫీ మొదలైనవి తెచ్చేరు. వస్తూనే చిన్న చిన్న గుడారాలు లేవనెత్తేరు. స్టౌలు గబగబ వెలిగించి, సీరియస్‌గా చకచకా తిరుగుతూ, పకపకా నవ్వుతూ జాలారివాళ్ళకి చాలా వినోదం కలిగించేరు.

తమ విరిగిపోయిన మునిగిపోయిన కొంపలని వాళ్ళు ఫొటోలు తీస్తుంటే, ఆ అమాయకులు చూసి సంతోషించేరు. పట్నం నించి వచ్చిన ఆ స్త్రీ పురుషులు కీసర బాసర మాట్లాడుకుంటూంటే, నవ్వుకుంటూంటే పాపం వాళ్లుకూడా నవ్వేరు. ఇళ్లు మర్చిపోయి, హృదయంలోని బెంగ మర్చిపోయి, ఓడలో వాళ్ళకోసం వచ్చినవాళ్ళని చూస్తూ మురిసిపోయేరు.

చీకటిలో బైల్దేరిన పడవలు కొంచెం సేపటికి లేతగా తెలుపెక్కిన కంటిచూపు గీతమీద నల్లటి చుక్కల్లా అగుపించేయి. తెలుపెక్కుతూన్న ఆకాశంమీద "సీగల్స్" ఉల్లాసంగా అరుస్తూ తిరిగేయి. క్రమేపీ తూర్పు దిక్కు స్ఫటికపు తెలుపుగా, లేత గులాబీగా, జేగురుగా, ఎఱ్ఱగా, చిక్కటి నెత్తురుగా మారింది. వెంటనే సూర్యకాంతి అంతటా ఆవరించింది. కొంచెం పైకిలేచిన సూర్యకిరణాలు సముద్రంమీదపడి, విరిగి ఒక్కొక్క నీటి చుక్కని ఒక్కొక్క సూర్యుడిగా మార్చేయి.

ఆ వెలుగులో ఓడలో వాళ్ళు కోనాడరేవు చేరుకున్నారు. రేవులో వాళ్ళకోసం రెండు చెవులు తాకే చిరునవ్వులతో ఎదురు చూస్తున్నారు పట్నం నుంచి వచ్చినవాళ్ళు. పలకరింపులు కరచాలనాలూ సాగుతున్నాయి. గంగ తండ్రీ, అతని బలగం ఓ పక్కకి నిలుచుని యీ తతంగం అంతా చూస్తున్నారు.

ఆ తెల్లవాళ్ళలో ఒక యింజనీరున్నాడు. యువకుడు, అందమైనవాడు. అతడు గంగ తండ్రి దగ్గరకువచ్చి, ఏవో ప్రశ్నలు వేసేడు. సంజ్ఞలద్వారా కొన్ని శబ్దాలద్వారా మాట్లాడుకున్నారు. దొర గంగవైపు నవ్వుతూ చూసేడు. దగ్గరకెళ్ళి భూలోకా దగ్గిర్నించి గంగను తీసుకున్నాడు. మొదట గంగ రానంది. కాని దొర బుజ్జగించి ముద్దు పెట్టుకోగానే సిగ్గుగా నవ్వింది. దొరకి అంతే యీడు కూతురుంది. ఓడలో, తుఫాను మధ్య చావుబతుకుల్లో వూగిసలాడుతున్నప్పుడు అతడికి కూతురు జ్ఞాపకం వచ్చింది.

గంగని అతడొక డేరాలోకి తీసుకెళ్ళి ఓడలోంచి తెచ్చిన బిస్కట్లు, చాకలెట్లు, బొమ్మలు యిచ్చేడు. గంగ చెయ్యిపట్టుకుని కొంతసేపు తీరం మీద షికారు తిరిగేడు.

కొంతసేపు తరవాత వాళ్ళంతా కార్లెక్కి పట్నం వెళిపోయేరు. వెళిపోతుంటే గంగ అతనివేపు రెప్ప వాల్చకుండాచూస్తూ నిలబడింది. అప్పుడు నిదానంగా వీస్తున్న గాలిలో కొబ్బరిచెట్లు ఉల్లాసంగా వూగుతున్నాయి. తడిసిన కొబ్బరాకులు ఉదయపు ఎండలో తళతళ్ళాడుతున్నాయి.

అది గంగ ఐదేళ్ళప్పటి ముచ్చట. అవాళలాగే యివాళకూడా యెండలో సముద్రంమెరుస్తూంది. ఆకాశంలో కొబ్బరాకులు కదుల్తున్నాయి. గంగ కొబ్బరిచెట్టు చాటునుంచి కోలకంటి కొసతో చూస్తూంది. ముగ్గురు దొరలు. యిద్దరు దొరసాన్లు - వాళ్ళలో వొక దొర యిటు తిరిగి అటు తిరిగి చివరకు బైనాక్యులర్లు తనవేపు గురిపెట్టేడు. గంగకి వొళ్లు ఝల్లు మంది. గుడిశలోకి వొకటే పరుగుతీసింది.

వెళ్ళి మంచంమీద వెల్లకిలా పడుకుంది. ఆమె హృదయం యెగిరి పడుతూంది. ఆ దొర చిన్నప్పుడు, ఆనాడు జాలారిపేటలో యెత్తుకుతిప్పి నతనే. పొడుగు మనిషి, నవ్వు కళ్లు, నవ్వు పెదిమలు, నాటికీ నేటికీ సుమారు పదహారేళ్లు తిరిగిపోయాయి. అప్పుడప్పుడూ మావ అంటూంటాడు 'ఒలె గంగా— నువు యిరగబూసిన తురాయిసెట్టువే— పొడుతీసే గుఱ్ఱప్పిల్లవే— నీకు కోపవొచ్చినా, దయొచ్చినా గంగ పొంగినట్టే వుంతాదే' అని. ఈ పదహారేళ్ళలో తనలో యెంతో మార్పొచ్చింది. కాని ఆ దొర అలాగే వుండిపోయేడు, తన గుండెల్లో మరుపు పొరల్లో దాగు న్నాడు, ఇవాళ హఠాత్తుగా బైటకొచ్చాడు. ఆ రోజున అతనంటే గొప్ప సరదావేసింది. ఇవాళకూడా సరదాగానే వుంది. కాని సరదాకంటె బాధగా కూడ వుంది.

పోలయ్య ఇంటికొచ్చేడు. తల్లి వేణ్ణీళ్లిచ్చింది సిలవరు ముంతతో. గంగ మొగుడికి నీళ్లుపోసింది. వీపు, చేతులు, కాళ్ళురుద్దింది. పోలయ్య చెప్తోన్న వేట ముచ్చటవింటూ, అతని వొళ్లు రుద్దుతూందిగాని ఆమె మన సంతా ఆ దొర మీదే వుంది.

గంగ ఆలోచనలు పరుగెడుతూంటే బైట కేకలు, తిట్లు, బేరాలు· పాటలు, చేపలు యెండ్రికాయలకోసం గుంపులుగాచేరి అరుస్తున్న కాకుల గోల, ఆకాశంమీద అల్లాడుతున్న గెద్దల అరుపులు 'ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగిస్తున్నాయి.

ఒక గంటలో అంతా నిశ్శబ్దం. కష్టమ్మువాళ్లు వాళ్ళపని ముగించుకు వెళ్లిపోయారు. వర్తకులు తమకి కావలసిన చేపలు, జల్లలు తీసుకుపోయేరు. జాలారి స్త్రీలు చేపల గంపలెత్తుకుని కొండ యెగుబడిని పట్నంవేపు విస

విస నడిచేరు. వేటనించి తిరిగొచ్చిన వాళ్లు ఉడుకునీళ్లు పోసుకుని, తిని, పడుకున్నారు. ముసలాళ్ళు వలతాళ్ళు పడుకుతూ వలలు బాగుచేస్తూ దూరంగా చెట్లక్రింద కబుర్లాడుకుంటున్నారు.

సముద్రం పోటు తగ్గి వుబుసుపోని పిల్ల కెరటాలు తపతపా విరుగుతున్నాయి. ఉండుండి కఠోరంగా అరుస్తున్న కాకి అరుపు నిశ్శబ్దాన్ని యెక్కువ చేస్తూంది.

పోలయ్య గురకపెట్టి నిద్రపోతున్నాడు. నాలుగ్గంటలైతేగానిలేవడు. అత్త పట్నానికెళ్ళింది. పొద్దుగూకితేగాని తిరిగిరాదు. వాడ వాడంతా నిద్రపోయింది. సూర్యుడు నడినెత్తిమీదున్నాడు.

గంగ నిమ్మళంగా యింట్లోంచి బైటకొచ్చింది. దొరలు, దొరసాన్లు దూరంగా కొండ యేటి వాలెక్కుతూ గాలికి కదుల్తూన్న రంగు రంగుల పూవుల్లా అగుపిస్తున్నారు. పదహారేళ్ళు తన గుండెల్లో కిమ్మనకుండా నిద్రపోయి యివాళేమేలుకుని మారాం చేస్తున్న ఆ నవ్వు పెదిమలతన్ని చూడాలనిపించింది. ఇంట్లోకెళ్లి నిద్రపోతున్న మొగుడి మొహం, అద్దంలో తన మొహం ఓసారి చూచుకుని బైటకొచ్చి నడక సాగించింది. ఆమెని పిట్టమనిషి చూళ్ళేదు. కాని తీరాన్ని యెగురుతూన్న వోపిట్ట చూసింది. దాని అరుపు విని గంగ అదిరిపడింది. తిరిగ పోదామనుకుంది. కాని కాళ్ళ బలం కన్న మనసు బలం ఎక్కువ.

అక్కడ సముద్రం భూమిలోనికి చొచ్చుకొచ్చి గుండ్రంగా మడుగులావుంది. తీరం మీద యిసకలేదు. నీట్లో అలలు లేవు. కొన్ని విశాలమైన నాపరాళ్ళున్నాయి. కిందకివాలిన చెట్ల కొమ్మల నీడలున్నాయి. దూరంగా సముద్రం మీద యెండ ధగధగ మెరుస్తూంది. రివటగాలితో కరివేపచెట్ల కమ్మటి వాసన ఎగిరివస్తూంది. ఉండుండి మేఘాల నీడలు జోరుగా సముద్రపు నీటిమీంచి పరుగెత్తుకొచ్చి కొండచరియ మీంచి పారిపోతున్నాయి.

గంగ నెమ్మదిగా కొండ దిగివచ్చి ఒక పెద్ద చెట్టుచాటునుంచి ఆ తెల్లవాళ్ళని చూస్తూంది. వాళ్లు స్నానాల దుస్తులతో నీళ్ళల్లోకి దిగేరు.

కొంచెం సేపు పోయేక వొక దొర వచ్చి ఒళ్ళుతుడుచుకుని ఫ్లాస్కులోంచి టీ ఒంపుకొని తాగుతూ సిగరెట్టు కాలుస్తున్నాడు. మిగిలిన వాళ్ళు జంటలుగా విడిపోయి యీదుతూ కొండ వొడ్డంట చెరోవేపు వెళ్ళారు. తనదొర ఒక దొరసానితో తనున్నవెంపే వచ్చేడు. వాళ్లు విచ్చలవిడిగా యీదుతూ, కబుర్లాడుకుంటూ, నవ్వుకుంటూ, తనకి అతి సమీపంలో కొచ్చేరు. గంగ చెట్టులో దూరి, వొళ్ళంతా కళ్ళు చేసుకుని, కళ్ళల్లో గాభరాతో చూస్తూంది. చల్లని గాలిలో అతిసుందరమైన ప్రకృతిలో, కదలని యెండ వెలుగులో, నీలంగా, ఆకుపచ్చగా వున్న నీటిమీద వుండుండి పరుగెడుతూన్న నీడల్లో జలకాలాడుతున్న వాళ్ళామెకి దేవతల్లా అగుపించేరు. దొరసాని గౌను పైభాగం భుజాలు తప్పిపోయింది. అతడామెని హృదయానికి హత్తుకుని పల్లటీలు కొడుతున్నాడు. ఆమె ఒడ్డు సమీపంలో కూర్చునప్పుడు నీట్లో సగం మునిగితేలుతూన్న ఆమె సౌందర్యానికి అతడు ముగ్ధుడై, వెంటనే ఆమెని లోతుల్లోకి లాగితీసుకుపోయాడు.

వాళ్ళక్కణ్ణించి వెళ్ళిపోయాక గంగచెట్టుచాటునించి బైటపడింది. ఒకసారి నలుపక్కలాచూసి నీట్లోకి నిమ్మళంగా దిగింది. నీరు మంచులా వుంది. కాని ఆమె మనసుతోబాటు శరీరం కూడా అగ్గిలావుంది. పైట నడుంచుట్టూ బిగించి లోతుకెళ్ళింది. నిండు మునకలు మునిగింది. ఆ దొర దొరసాని జలకాలాడిన దగ్గరకెళ్ళింది. అక్కడ నిశ్శబ్దంగావుంది. దూరంగా యెండలో సముద్రం పాదరసంలా మెరుస్తూంది. సమీపస్థలం అంతా చిక్కటినీడ. నిమ్మళంగా కదుల్తూన్న చెట్లకొమ్మల సందుల్లోంచి సూర్యరశ్మి పడి నీటిమీద అందమైన ముగ్గులు పడుతున్నాయి. కొండకోనలో కరివేపాకు, పిసినోకపళ్ళు, అంబాళపుకాయలుకోస్తూ, రాల్తున్న బాదంకాయలేరుకుంటూ కుర్రకారు పాడుతున్న పాటలు ఉండుండి గాలివాటుగా యెగిరొస్తున్నాయి. చెట్టుమీద రెండు పిట్టలూసులాడుకుంటున్నాయి. గంగ తన నగ్న సౌందర్యానికి మురిసిపోయింది. తన యౌవనం ఒరలోంచి తీసిన కత్తిలా వుంది.

గంగ వెల్లకిలా యీదుతూ నోటితో ఆకాశంవేపు నీరు చిమ్మింది. 'ఏటుందని. ఆ యిరగబాటు ఆ తెల్లదానికి ఆ దొరకి తగదు' అనుకుంది.

గంగ తడి ఆరని చీరతో తడి జుత్తుతో ఇంటికొచ్చేసరికి మూడైంది. పోలయ్య అప్పుడే లేచేడు. గంగవాటంచూసి నవ్వేడు. ఆమె అతనికేసి తేరిచూసి చిన్నగా నవ్వింది. బుగ్గలు చిన్న లొత్తలు పడ్డాయి.

'ఇప్పుడు తాన్నవేటే గంగా?' పోలయ్య.

గంగ జవాబు చెప్పలేదు. తిరిగి చిన్నగా నవ్వింది. చిన్న రివటగాలి వీచింది.

పోలయ్య వొళ్ళు నల్లశానాపురాయిలా నిగనిగలాడుతుంది. నిద్రలేచిన కళ్ళు యెర్రగావున్నాయి. శరీరం కండలుతిరిగిన గిడస - అతను చిరునవ్వు నవ్వలేడు. బెక బెక బాండ్రుకప్పలా నవ్వుతాడు. భూలోకానవ్వు గుర్రం సకిలించినట్టే. కాని ఆ దొర తెల్లగా చంద్రవంకలా ముద్దుగా నవ్వుతాడు. పరాకుగా తిరిగి చిరునవ్వు నవ్వుకుంది. పోలయ్య మనసు చలించింది. లేచి గది తలుపులుమూసి అమాంతంగా గంగ చెయ్యిపట్టుకు లాగి మంచంమీద పడుకోబెట్టబోయేడు. ఆమె కళ్ళెర్రజేసి విదిలించుకుంది. అతడుద్రేకంతో ఆమెని గట్టిగా బంధించేడు. ఆమె 'అత్త అత్త' అంది. అతను 'రాదు రాదు' అని ఆమెని స్వాధీనం చేసుకోబోయేడు. ఆమె చీదరించుకుని, తిట్టి, గిల్లి, బైటకొచ్చి సముద్రంకేసి చూస్తూ నిలబడింది. పోలయ్య ఓడిపోయి చేతకాక మంచంమీద వాలి చుట్ట ముట్టించేడు. గంగ తలయెత్తింది. ఆకాశంమీద ఒక చిరునవ్వు మెరిసింది. ఆమె కళ్ళల్లో నీళ్లు తిరిగేయి.

పది నిముషాలుపోయేక గంగ యింట్లోకి వెళ్ళింది. టీ తయారుచేసి పోలయ్యకిచ్చింది. అతడామె ముఖంలోకి బెరుకుగా చూసేడు. ఆ చూపులో కామం లేదు, సిగ్గుంది. జాలివుంది, దయవుంది.

'గంగా! నువు దేవతవే, నానొట్టి మూర్ఖపోణ్ణి.'

గంగ కళ్ళంట నీళ్ళొచ్చేయి. తనవల్లనే ఆమెకి దుఃఖం కలిగిందనుకుని పోలయ్య గంగ కళ్ళొత్తేడు 'ఏడకే... నాను గాడిదెనే. సమయం తెల్దు. సరసం తెల్దు. ఇయాల సినిమాకెల్దం— బేగితయారో' గంగ అలాగే అని తలవూపింది.

నాలుగున్నరవగానే గంగ తలదువ్వుకుని కొప్పులో పూలు తురుము కుంది. రంగుచీరకట్టి రంగైనరైక తొడిగింది. చామనఛాయ శరీరంతో చంపకి చారడేసి కళ్ళతో మత్స్యకన్యలా వుంది. పోలయ్యా తయారయేడు. ఇంతలో అతని తల్లివచ్చి కొడుకూ కోడలు వాటంచూసి 'యాడకురో పయనాలు' అంది. చెప్పేడు.

'కు్రదాయి జాగత్త్తరో. రేత్తిరి రామాకండి. తలుపులున్న యింటి కాడ తొంగోండి. రేత్తిరి బోటుంటాది, నేకపోతాది, కొండమీద పురుగూ పుట్రావుంటాది. సినిమాలో కురిసీలమీనే కూకోండి.'

'లెమ్మా— అనాగానే— నానుంపే నీ కోళ్ళకి యేం బెయ్యామే.'

'గంగా: యావాన్తిన్నావా, ఆడికెట్టేవా?' అత్త. గంగ మొగుడి వేపు చూసింది.

'పరవానేదో లెమ్మ. టైమునేదు. వొటేల్లో తింటాం.'

గంగ తయారైందన్నమాటే గాని మనసదోలా వుంది.

వాళ్లు గడపదాటి నాలుగడుగులు వేశారో లేదో, వాడ అవతల చివర ఇంటి దగ్గరేదో గల్లంతు బయల్దేరింది. కేకలు, యేడుపులు మిన్ను ముట్టేయి. అంతా అటువెళ్ళేరు. వీరేసు యింటిదగ్గర జనం పోగయేరు.

వీరేసు పెళ్ళాం పైడమ్మ మూణ్ణెల్లయి కన్నవారింట్లోనే వుండి పోయింది. మొగుడితో తగువాడి వచ్చేసింది. పైడమ్మ మొగుడు ఆమెకి మేనమావే. పైడమ్మ తల్లి కోరికోరి తమ్ముడికే యిచ్చింది, కూతుర్ని. వాళ్ళది భీమునిపట్నం. పైడమ్మకి ఇద్దరు కొడుకులు, వొక కూతురు. మొగుడు తిట్టేడనో, కొట్టేడనో వుండుండి కన్నవారింటికి పారిపోస్తూం టుంది. అలిగివచ్చినపుడల్లా మావ స్వయంగావచ్చి బతిమాలి తీసుకెళ్తాడు. అప్పుడే వెళుతుంది.

మొగుడొక రెల్లిమనిషినుంచుకున్నట్టు పైడమ్మకు తెలిసిపోయింది. వెంటనే పైడమ్మ మరిడమ్మైపోయింది. వెర్రిపీరులా అల్లల్లాడిపోయింది. చివరకోనాడు కూతురుతోసహా బస్సెక్కేసింది

'ఒరె మావా! నీకూ నాకూసరీ. ఆ రెల్లినాయార్ల పీనిగకాట్లో కెల్లాల. నువ్వొచ్చి నన్ను బతిమిలాడాలా—— న్రానావాలా—— అంతే—అదే మాట-- పైసలా !' అని బస్సులో మొహం అటు తిప్పేసుకుంది.

మూణ్ణెలలెత్తింది. పైడమ్మ అత్తవారింటికి తిరిగిరాలేదు. భీముడి పట్నంనించి యెవరొచ్చిరమ్మన్నా చివరికి తల్లిచెప్పినా, ఆ నామొగుడి పెళ్ళాం... రెల్లిదాయి సచ్చిందా నేదా అజ్జెప్పండి తొలీత' అనేది గాజులు గలగల్లాడేలా యెడం అరిచేతిమీద కుడిపిడికిలి బాదుతూ. 'ఆ నాయార్లు సచ్చిన్నాడే నానీ యాణ్ణించి కదుల్తా'నంది.

ఆ రోజు పైడమ్మతాత స్వయంగా వచ్చేడు. తండ్రితోపాటు యిద్దరు స్నేహితుల్నికూడా పంపేడు పైడమ్మ మొగుడు - వాళ్ళు' ఫుల్ పవర్స్'తో వచ్చేమన్నారు. కొంతసేపు మంచిమాటలు, కొంతసేపు సంఘర్షణ అయేక వచ్చిన పెద్దమనుషులు రెచ్చిపోయేరు. 'రాపోతే గొరా గొరా యీడ్చి లాక్కెల్తా'మన్నారు. పాపమ్మ, పైడమ్మ. తాతా చిక్కులోపడ్డారు మనవరాలు మంకుది. దాని తండ్రి మెతక. తల్లికి కూతురంటే మమకారం- తమ్ముడంటే అభిమానం. ఓ సారి 'ఎల్లోలెమ్మా ! నాను కూడా వొత్తాను' అంది.

'నోర్మూసుకోలేలెమ్మా ! నీ తమ్ముడికి మరో నంజుందిలేయే—— నానెందుకే, శావలకరాబీ——' యీసడించింది.

'పోనీ ఆడాగ్రిరాగ్రిదా... నన్ను శూడ్డానికి రారాదా...' తండ్రితో అంది దీనంగా. తండ్రి నిస్పృహగా తలూపేడు. వచ్చిన పెద్ద మనుష్యుల్లో ఒకతనికి కోపం వచ్చింది.

'ఎలాగెలాగా! మొగుడంటే మొగుడే...' రమ్మంటే రావాల- సమ్మంటే సావాల!'

ఈ దెబ్బతో పైడమ్మ రెచ్చిపోయి శివతాండవం చేసింది. కలీబడి పెద్దమనుషుల్ని కొట్టింది. దాన్తో వాళ్ళు తారెత్తిపోయేరు.

ఉండుండి కేకలు. కలీబడ్డాలు- తిట్లు. వాడంతా మార్మ్రోగుతూంది. చివరికి వాడపెద్ద అందర్నీ సర్దుచేసేడు. తీర్పు చెప్పేడు.

'రంబనాటి పెల్లం వుండగా ఆడు మరొకత్తి నెలగుంచుకున్నాడు. తప్పాడిది, కొంత తప్పు దీన్దీని. మొగుడికి సెప్పాల- పెద్దోళ్ళచేత సెప్పించాల— యెలాగో సరిచేసుకుపోవాలా. సమందాలు తెగించుకోడం నచ్చనంగాదు. వొలెపైడి- నాను పెద్దోణ్ణి- సెప్తున్నా నినుకో. ఆడిదివరకు రెండుమూడు సార్లొచ్చి బతిమలాడి తీసుకెళ్లాడా లేదా? ఈపాలి నువ్వే యెల్లు, గవరవంగుంతాది. అందరికీ సెప్తున్నానినుకొండి. ఎంతైనా ఆడదానికి మొగుడే దేవుడు మరిగంతే. పైడమ్మా ఈపాలి నువ్వెల్లు.- రేపే బైలెల్లు. సరేన్రా ఇక నెగండి.' అతడు వెళ్ళిపోయేడు.

కొంతసేపు గుసగుసలు, చీవాట్లు, ఏడుపులు, ముక్కుచీదులు- తరవాత నిశ్శబ్దం. పైడమ్మ తల్లి మనస్సు చల్లబడింది.

'ఆడదానికి మొగుడే దేవుడు' మనసులో పదేపదే అనుకుంటూ గంగ మొగిడితో యింటికి వచ్చేసింది. రాత్రి పోలయ్య గంగతో హాస్యమాడేడు.

'ఒలే గంగా— నేన్నీకు దేవుణ్ణే—ఔనా?'

గంగ అతనివేపు తేరిచూచింది. తెల్లగా నవ్వు బుగ్గలు, నవ్వుకళ్ళు, నవ్వు పెదిమలు లేవు.

రెండు మూడు రోజులు పోయేక ఓ సాయంత్రం పోలయ్య బాగా తాగి సిమ్మడనే మరో జాలారి మనిషితో దెబ్బలాడేడు. వాళ్ల తిట్లాట కొట్లాట ఆరంభించగానే అక్కడ జనం పోగయేరు. కొందరు వాళ్ళని విడదీశారు. కానీ వాళ్ళ తిట్లాగలేదు. తిట్లు తల్లులుదాకా పెళ్లాలదాకా వెళ్ళేయి.

'ఒరే సిమ్మిగా! నా పెళ్లాన్నంటావ్రా! అది లచ్చిమిరా, పతివరతరా, దాని కాలిగోరికి పోలింది యీ నోకంలో వుందిరా? నాయాలా? నా పెల్లం గుడిసేట్నంజరా? సూస్కో— సత్తె పెమానంగా నిన్నా గంగమ్మతల్లే మింగేత్తాది. పది రోజులుల్నాడు సూస్కో నీపని సపారా. సుళ్లోపడి సత్తావో— సొంటసేపే యేసుకుంటాదో — ఆ తల్లికెరిక' పోలయ్య

కందులు విసిరినట్టు పళ్లు పటపట్లాడించేడు. వెంటనే యిద్దరూ మళ్ళీ కలబడ్డారు. తిరిగి కొందరు వాళ్ళను విడదీసి యిళ్ళకి తీసుకుపోయేరు.

గంగ మొగుణ్ణి యింట్లోకి తీసుకెళ్ళి పడుకోబెట్టింది. పోలయ్య కొంతసేపు తిట్టి — తరువాత యేదోవాగి గాఢనిద్రలో మునిగిపోయేడు. పోలయ్య తల్లికూడా యితర స్త్రీలతో గల్లంతులో అరిచి అలసిపోయింది. వంటలేదు, పెంటలేదు. పడుకుంది. ఇంట్లో దీపమైనా లేదు.

పది గంటలకి వాడ అంతా నిశ్శబ్దమైంది. గంగకి నిద్ర పట్టలేదు. మనసు కొట్టుమిట్లాడిపోతుంది. లాంతరు వెలిగించి వత్తి తగ్గించింది. సముద్రపు హోరు నిర్విరామంగా వినిపిస్తూంది. తలుపు సందుల్లోంచి బైట వెన్నెలగుపిస్తోంది. అత్త పెడుతూన్న గుర్రు వినిపిస్తూంది. మధ్యాహ్నపు అన్నం కొంచెం వుంది. మొగుడికి పెడదామనుకుంది.

'మావాఁ! మావాఁ?' కుదిపింది. పోలయ్య పలవరించి వొత్తిగిల్లేడు అంతే.

అర్ధరాత్రి దాటేవరకూ గంగ అలాగే కూచుంది. తల బరువెక్కి మొగుడి పక్కకి వొరిగింది.

* * *

గంగ లేచి గది తలుపుతీసి బైటకొచ్చి తలుపు బైట గొళ్ళెం పెట్టింది. లేకుంటే గాలికది కిర్రు కర్రు మంటుంది.

బైట వెన్నెల పుచ్చ పువ్వులావుంది. విరుగుతూన్న కెరటాల మీద వెన్నెల పడి కాల్తూన్న మెగ్నిషియం వైరులా కళ్లు మిరుమిట్లు గొల్పుతూంది. గాలికి కొబ్బరాకులు పలపల్లాడుతున్నాయి. గంగ తడి యిసకలో సించుని ఉవ్వెత్తుగా లేచి విరిగి పడుతూన్న కెరటాలు చూస్తూంది. పరాకుగా వున్న తన భుజంమీద ఒక చెయ్యిపడి గంగ వులిక్కిపడి వెనక్కి తిరిగిచూచింది. విప్పారిన కళ్ళకి రెప్పపాటు లేదు. గుండెకాయ చెవుల్లోనే దడ దడ కొట్టుకుంటోంది.

అతడామె మొహంలోకి చూచి చిరునవ్వు నవ్వేడు. భయపడకని సంజ్ఞచేసేడు. ఆమె పారిపోదామనుకుంది. కాళ్లు రాలేదు. అతడే చిన్న చిన్న మాటలు నిమ్మళంగా అన్నాడు. అవి ఆమెకి అర్థం కాలేదు. కాని అర్థమైనట్టనిపించింది. అతడామెని దగ్గరగా తీసుకున్నాడు. వాళ్లిద్దరి పాదాల మీంచి విరిగిన కెరటం నీళ్ళు పరుగెత్తాయి. కిందికి చూసి వొకరి మొహాలొకరుచూసుకు నవ్వుకున్నారు. అప్పుడే వాళ్ళ తలమీంచి వొక పక్షి జంట అరుచుకుంటూ వెళ్లిపోయింది. వాళ్లు పైకి చూసి తిరిగి వొకరి మొహం వొకరు చూసుకున్నారు. 'పద' అన్నట్టయింది. ఆ దొర! తన దొర!

అతడామె చుట్టూ చెయ్యివేసి తీసుకెళుతున్నాడు. ఆమె మైమరచి అతనితో పోతూంది. వాళ్లాకొండ యేటవాలు యెక్కి అవతలకి దిగేరు. విరగ్గాస్తున్న వెన్నెల్లో నక్కలు వాళ్ళని చూసుకుపోయేయి. పాములు జర జర వాళ్ళ ముందునుంచి పాకిపోయాయి. వాళ్ళంతకు ముందు స్నానంచేసిన స్థలం చేరుకున్నారు.

వెన్నెలలో చెట్లనీడలు కారు నల్లగా వున్నాయి. సముద్రం పాద రసంలా మెరిసిపోతూంది. అతడు మాట్లాడిన ప్రతిమాట గంగకి బోధపడి నట్టయింది. అతడి కౌగిలిలో ఆమె కరిగిపోయింది. అతడి నుదుటిని, నవ్వు బుగ్గల్ని, నవ్వుకళ్ళని, నవ్వు పెదిమల్ని ముద్దుపెట్టుకుంది. తన హృద యంలో యేళ్ళతరబడి బిగుసుకున్న ముడి విడిపోయినట్టయింది. మనసు తేలికైంది. ఆ స్థలం ప్రపంచంతో సంబంధం లేనిది. గంగ అతనివొడిలో వెల్లకిలాపడుకుని అతని మెడపట్టుకుని మనసుతీరా నవ్వింది. వెర్రిగా పాట పాడింది. నగ్నంగా యిద్దరూ సముద్రంలోకి దిగేరు.

'గంగా! నీ అందం సాటిలేనిది.'

గంగ గర్వంగా నవ్వింది.

అతడు గంగని సగందూరం దిగబెట్టేడు. రేపు మళ్లీవస్తా అని వెళ్ళిపోయేడు. గంగ అతనివైపు చూస్తూ నిలబడిపోయింది.

తలుపు తెరుచుకు లోపలికిరాగానే అత్త గుర్రు వినిపించింది - గంగకి. మావఁ చచ్చినట్టుపడివున్నాడు. అతనిమీద తను కప్పిన దుప్పటి పక్కగా పడిపోయింది. అది సరిచేద్దామని వంగింది. ఆమె చెయ్యివణికింది. పోలయ్య పలవరిస్తున్నాడు. 'నా పెళ్లాం లచ్చిమిరా. అది పతివరతరా— సూసో— పది రోజుల్లో నీ పని సఫా...'

గంగ తల తిరిగిపోయింది. అతణ్ణి కాదుకద అతని దుప్పటినికూడా తాకలేననుకుంది. కూలబడిన గంగ కళ్ళల్లోంచి పాములు జారినట్టు కన్నీటి థారలు పడ్డాయి. నిశ్శబ్దంగా యేడ్చింది. ఎంత ప్రయత్నించినా కంటిమీద కునుకు రాలేదు.

దొంగతనం, తను చేసినపనీ దాగవు - ఇది ఎప్పటికైనా బయట పడుతుంది. ఆనాడు పైడమ్మలాగే తన బతుకూ్కడా బైటపడుతుంది. తన పేరు నలుగుర్నోట్లో పడుతుంది. తనని అభిమానంగా చూస్తూ, తన కన్నవారి మూలంగా తనకి మర్యాద చేస్తూన్న అత్త తనంటే అసహ్యించు కుంటుంది. తనని మనసారా ప్రేమిస్తూ, తన సిగపువ్వు వాడకుండా చూసుకుంటున్న మాఁవకి తనంటే రోతకలుగుతుంది. తప్పుదారి తొక్కిన ఆడదానికి అత్తవారింట్లో స్థానం వుండదు. వాడవాళ్ళంతా యేకమై తనవేపు చూపుడువేలు గురిపెట్టి మెటికలు విరుస్తారు. అంతా కలిసి తనని వాడ లోంచి తగిలేయొచ్చు.

ఎక్కడికి పోతుంది! కోనాడ పోతుంది. కాని యే మొహంతో! నీతి తప్పినాడదానికి, నిజాయితీ తప్పిన మొగాడికి బతుకు నవ్వులపాలే. తండ్రి వూరికి పెద్ద. అందరి తగువులూ తీర్చే అతను, కులజైన కూతుర్ని గడప తొక్కనివ్వడు. తల్లి యేం జేస్తుంది? ఏడుస్తుంది. జంతువులాంటి భూలోకా కూడా తనవేపు వురిమి చూస్తాడు. పుట్టినింట్లో, మెట్టినింట్లో చెడ్డయిన స్త్రీకి సిగ్గుమాలిన బతుకే గతి. గతిలేని చావే గతి. గంగ కుమిలి కుమిలి యేడ్చింది.

తెల్లవారింది. జాలారివాడ మేలుకొంది. లేత యెండలో సముద్రం కలకల్లాడుతూంది.

'గంగా ! కళ్లేమే అనాగున్నాయ్ - యెర్రగా ? మొగం వోడి పోనాదేమే ?' పోలయ్య.

'రేత్రిరి నిద్దర పట్టనేదేటోలెమ్మా' అత్త. గంగ యిద్దరివేపు కొస కళ్ళతో చూసి తలదించుకుంది. 'లేమ్మో మొన్నా - సినిమాకి తీసుకెల్తానని తీసుకెళ్ళనేదే. అందిగ్గామాల ఉడుకుబోత్తనం. సిలకా! సినిమా పారిపోద్దా, నువ్వు పారిపోతావా ...' గంగ జవాబు చెప్పలేదు.

ఎనిమిది గంటలకి యెండ కర కర పొడిచింది. తీరం పడవలతో, జాలారి జనంతో కలకల్లాడుతూంది. సాయంత్రం దెబ్బ లాడుకున్న పోలయ్య, సిమ్మడు వూసులాడుకుంటూ కలసి పడవల దగ్గిరకెళ్లేరు. అక్కడ ఆడాళ్ళు కూడా వున్నారు. గంగ గుమ్మంలోంచే చూస్తూంది. సిమ్మడి కూతురు కాల్చిన మూడు జొన్నపొత్తులు తెచ్చి తండ్రికిచ్చింది.

'ఒరే పోలన్నా... నిన్న నీ పెళ్ళాన్ని తిట్టేనాగ్రి. అందుకిది సిచ్చ. ఇందరెండు పొత్తులు' సిమ్మడు.

పోలయ్య పొత్తులందుకుని సముద్ర ఘోషని మించిన స్వరంతో 'గంగా బేగిరాయే! సిమ్మిగాడిందు చేత్తుండాడు' అని కేకేసేడు.

గంగ నిమ్మళంగా వచ్చింది. పోలయ్య దగ్గిరకి రాగానే విరిగిన కెరటం వాళ్ళ కాళ్ళ కిందనించి ప్రవహించింది. గంగ కిందికి చూసి తల యెత్తి మొగుడు వేపు చూడబోయి తల దించుకుంది. అప్పుడే రెండు "సీగల్స్" అరుస్తూ వాళ్ళ తలమీంచి యెగిరిపోయేయి. గంగ పైకి చూసింది. ఆమె కళ్ళలో నీళ్లు తిరిగేయి.

'ఒరే సిమ్మన్నా గంగకి సినిమా పిచ్చిపట్టుకుందిరా...'

గంగ తలూపింది.

'పోన్లే గుంటా, ఇందా పొత్తి. తిడిత్తిట్టేడు గాని, మళ్ళీ దోస్తి కలిపి సుండు. తీస్కో-యే-గంగనోకెల్తన్నా - తిరిగొత్తానో రానో - నా సేత్తో యిత్తన్నా - ఇందా -'

'ఎందుకు రావురా? టింగురంగా నాగొత్తాం. నీ గంగమ్మ, నా పెంటమ్మ సీతమ్మలు, సాయిత్తుర్లు - మనకేం బెంగేహ్...'

గంగ అక్కడ వుండలేకపోయింది. పొత్తి పట్టుకు పారిపోయింది. మంచం మీద బోర్లాపడి యేడ్చింది. 'గంగమ్మ తల్లి సమించు. తెలీన్దాన్ని పొరపాటు సేసెను. నా మొగుణ్ణి రచ్చించు. నా పసుపు కుంకం కాపాడు...' అని మొక్కుకుంది.

తీరం నిశ్శబ్దమైంది. గంగ అత్త వంట చేస్తూంది. గంగ ఉండుండి ఆకాశంవేపు సముద్రంవేపూ చూస్తూంది.

పన్నెండు గంటలకి హఠాత్తుగా వాతావరణం చల్లబడింది. కారు మేఘాలు సముద్రంమీంచి యేనుబోతుల్లా తీరంవేపు వస్తున్నాయి. అలల రొద. గాలి హోరు హెచ్చింది. ఊరంతా కారు చీకట్లో మునిగిపోయింది. మెరుపులు ఉరుములతో గాలివాన ఆరంభమైంది.

ఆకాశమంత యెత్తు కెరటాలు లేస్తున్నాయి. వాడంతా జలమయం అయింది. సముద్రంలో పెనుప్రళయంగా తుఫాను పట్టింది.

మొగుడు సముద్రంలోకి వేటకి వెళ్ళిన ప్రతి జాలారి స్త్రీ మొగుడు క్షేమం కోసం గంగమ్మ తల్లికి మొక్కుకుంది. తుఫాను హఠాత్తుగా వచ్చింది. అతి జోరుగా వచ్చింది! ఏది కొండ-ఏది వూరు. ఏది సముద్రం ఏదాకాశం అంతావొకటే - చీకటి - అంతావొకటే-వాన!

ఈ తుఫానుని మించిన తుఫాను గంగ మనసులో రేగింది. అత్త కూడా బెగిలిపోయింది. కొడుకు తిరిగి వస్తాడో రాడో! కాని కోడల్ని చూసి జాలిపడింది.

'ఏడకే గంగా! ఆడు లచ్చనంగా వొస్తాడు. మనకందరికీ గంగమ్మ తల్లే రచ్చ. మన కుటుంబాలు రెండూ అగ్గినాటివి. మనకే బాదారాదు...'

ఈ మాటలు గంగ గుండెల్లో బల్లేలుగా గుచ్చుకున్నాయి. తన మానం మంట గలిసింది. ఆ సంగతి అత్తకి తెలీదు. తను చేసిన పాపం అందరికి చుట్టుకుంది. భగవంతుడా! ఎంత పన్జరిగింది అనుకుంది.

ఒక్కొక్కమారు ఆకాశంపగిలేలా ఉరిమేది. వొక్కొక్క కెరటం ఫెడిల్లని తీరాన్ని ఢీ కొంటే గంగ గుండెల్లో దడ హెచ్చిపోతూంది.

అత్త కోడళ్లిద్దరూ నువ్వు తినంటే నువ్వు తిను అనుకుని యిద్దరూ తిండి తినలేదు. ఆకలి కడుపులతో, బెంగ నిండిపోయిన మనసులతో యిద్దరూ జీవచ్ఛవాల్లా వున్నారు.

సాయంత్రం అయిదవుతుంది. వాన తగ్గింది. కాని సముద్రం యీనిన పులిలా వుంది. చిన్న వెలుగొచ్చింది. ఆ వెలుగులో తీరాన్ని సమీపిస్తున్న పడవలు వుండుండి ఔపిస్తున్నాయి. జాలారివాడ వాళ్ళంతా వొకటే సంబరపడిపోయి తీరం చేరుకున్నారు. ఆ పడవలకి ప్రతిక్షణం వొక గండంగా వుంది. తీరం మీద మొగాళ్ళు నిస్సహాయంగా చూస్తున్నారు. స్త్రీలు యేడుస్తూన్నారు. కనిపిస్తూ యెత్తయిన కెరటాల చాటున మాయ మౌతూ, తిరిగి కొంతసేపటికి కనిపిస్తూ ఆ పడవలు తీరం మీద వాళ్ళని ఆశ, నిరాశల మధ్య వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పడవలు తీరం చేరే సరికి ఆరైంది. ఆతృత–భయం-సంతోషం - అదే అక్కడి వాతావరణం. అక్కడ గంగ వొక్కర్తేలేదు. తిరిగి వచ్చినవాళ్ళల్లో పోలయ్యొక్కడే లేడు. మరు క్షణంలో గంగఅత్త గుండెలు తెగేలా యేడుస్తూ యింటి కొచ్చింది.

'గంగా ! నా కూతరా ; మన పనైపోనాదే ... నా కొడుకు రానేదే ...'

గంగ కొయ్యబారిపోయింది. తరువాత అత్త మీద పడి హోరని యేడ్చింది. వాడవాళ్ళంతా వచ్చి యిద్దర్నీ పరామర్శించి వెళ్ళిపోయేరు.

రాత్రి పదౌతుంది. చీకటి జీబూతంలా వుంది. గంగ తలుపుతీసుకు బైటకొచ్చింది. గబగబ తీరానికి పరుగెత్తింది. తారులాంటి సముద్రంకేసి చూసింది.

ఎక్కడున్నాడు పోలయ్య ? ఎక్కడ ?

తన మొగుడి మరణానికి తనే కారణం !

అమ్మా ! గంగమ్మతల్లి ! నాను మనిసిని. నావల్ల తప్పు జరిగింది. అందుకు నన్ను సిచ్చించాలి కాని నా మొగుణ్ణా సిచ్చిత్రావు? ఇది నాయమేనా! నేను నీ కూతుర్ని గందా – నీకు జాల్నేదా ...

సముద్రం మరీ జోరుగా లేచి కఠోరంగా అరిచింది.

'మావాఁ' అరిచి కుప్పలా కూలిపోయింది గంగ.

'ఒలె గంగా! ఇదేటే ఇనాగరిసేవు. ఏడుస్తున్నవెందె – ఎహె ! తెలిగెయ్యే. నెగే నెగే. సినిమా సూత్తన్నవేటే...' పోలయ్య.

గంగకి తెలివొచ్చింది. మొగుడి మొహంలోకి తేరి చూసింది. మావేఁ! పీడకల అంది.

'ఒలే నీ గుండేటే ఇలా కొట్టుకుంటున్నాది – కలగాసేవేటే ...' పోలయ్య లేవబోయాడు.

గంగ జవాబు చెప్పలేదు. మొగుళ్ళోకి దూరిపోయి గట్టిగా పట్టుకుని, 'కదలకుండు మావాఁ! పల్లక తొంగో...' అంది.